**స్త్రీ పురుషులమధ్య అసమానత్వం వుండటం అన్యాయమే. అయితే, అసమానత్వం నుంచీ అసమానమైన ఆనందం పొందే దాంపత్యం వుంటే....!**

# సమానత్వం

"ఏమయితే నేను వెళ్ళి రానా...." సైకిలు తాళం చెవి తీసుకుని చెప్పులు వేసుకుంటూ అన్నాడు రవి.

"వెళ్ళకేం మహరాజులాగా వెళ్తారు. సెలవు రోజున దర్జాగా ఊళ్ళు తిరిగి రాగలరు. మగ మహరాజులు కద...." వంటింట్లోనుంచి ముందు గదిలోకి తొంగి చూసిన పావని ముఖం చిట్లించి అంది.

'నేనేమన్నా సరదాకి షికార్లు కొడదామని వెళ్తున్నానా?....ఇంట్లోకి ఏవో సరుకులు కావాలన్నావు కదా అని బయల్దేరేను ..." కొద్దిగా విసుగ్గా అన్నాడు రవి.

"ఎప్పుడు బజార్లోకి వెళ్ళినా యింట్లోకి సామాను తేవడానికోసమై అనడం అలవాటయిందిలెండి. ఏసాకయితేనేం....తిరిగి రావడం మీవంతు.... ప్రొద్దున్ననుంచి తలనొప్పి కాళ్ళనొప్పులతో చస్తున్నాను. అయినా నాకీ వంటా. చాకిరీ తప్పదు...." విసురుగా అంటూ ధామ్మని బిందెమూత తీసి నీళ్ళుముంచి బియ్యంవున్న గిన్నెలోకి పోసి. "ఆడదై పుట్టినందుకు ఇది తప్పదుగా...." అంటూ కత్తిపీట ముందేసుకుని కూర్చుంది పావని.

చెప్పులు విడిచి వంటింట్లోకి వచ్చాడు రవి. "తలనొప్పిగా వున్నా నువ్వే వంట చేయాలని నేనన్నానుటమ్మలూ? 'ఈరోజు వంటడ్యూటీ నీదోయ్ చిన్నా' అని ఒక ఆర్డరు వేసేస్తే సరిపోయేదిగా....నువ్వెళ్ళి రెస్టు తీసుకో....క్షణాలమీద చేసేస్తా వంట ..." పెళ్ళాం చేతిలోనుండి కత్తిపీట లాగేసి చెయ్యి పట్టుకుని లేవదీశాడు రవి

"అంత జాలెందుకులెండి! నా అవస్థ నేను పడతానుగానీ వెళ్ళరండి. ఎంత చదువుకున్నా. సంపాదిస్తున్నా వంటింట్లో పడి మగ్గిపోవలసిందే మేము" చెయ్యి విడిపించుకుంటూ కోపంగా అన్నది పావని.

"అందుకేనోయ్ ... వంట నేను చేస్తానుగానీ నీకు వీలయినప్పుడు బజారుకెళ్ళి ఆ సామాన్లేమిటో తెచ్చుకో.... అప్పుడు తెలుస్తుంది అందులో కష్టమేమిటో" రవి నవ్వుతూ అన్నాడు.

"బోడి బజారుకు వెళ్ళి సామాన్లు తెచ్చుకోలేనని అనుకోకండి. మగాళ్ళు వంట చేస్తే వాళ్ళ గౌరవానికేం భంగంరాదు. ఆడవాళ్ళే వండాలని ఏ శాస్త్రమూ చెప్పలేదు." ఇంకా చిటపటలు మానలేదు పావని.

మాటలతో లాభం లేదనుకున్నట్టుగా చటుక్కున రెండు చేతులతో పావనిని ఎత్తుకుని బయటకు తీసుకువచ్చాడు రవి.

"వదలండి! ఏమిటీ సినిమా హీరోతనం? పిల్లలు చూస్తారు...." అంటూ కెవ్వుమంది పావని.

"బాబీ! చిట్టీ! ఇలారండి" అంటూ రవి పిలవగానే ఎనిమిదేళ్ళ బాబీ, ఆరేళ్ళ చిట్టీ పరిగెట్టుకుంటూ వచ్చి, నాన్న చేతుల్లోవున్న అమ్మను చూసి గంతులు వేయడం మొదలుపెట్టారు.

"భలే....భలే నాన్నా! అమ్మ యివ్వాళ చిన్న పాపాయై పోయింది" అంటూ.

"బాబీ! చిట్టీ అమ్మను బెడ్‌రూమ్‌లో వదిలి పెడుతున్నా. బయటకు రానీయకుండా కాపలా కాయాలి మీరు. మంచం మీదనుంచి కదిలితే నన్ను పిలవండి...." అంటూ వాళ్ళకు చెప్పి పావనిని మంచం మీద దింపి ఇలస్ట్రేటెడ్ వీక్లీ, పేపరూ తెచ్చి పక్కన పడేసి, సెల్యూట్ కొట్టి బయటికి వచ్చి వంటింట్లో జొరబడ్డాడు రవి

నవ్వుకుంటూ పుస్తకం తెరిచింది పావని.

* * *

పుస్తకమూ, పేపరూ చదవడం ముగించే సరికి వంటింట్లో నుండి కమ్మని నెయ్యి తాలింపు ఘుమఘుమలు వచ్చి ఆమె నాసికా పుటాల్ని సోకి కడుపులో ఆకలి కరకర మంది పావనికి.

మెల్లిగా లేచి మంచం మీదనుంచి దిగే సరికి గుమ్మం దగ్గరే ద్వారపాలకుల్లా కూర్చున్న పిల్ల రాక్షసు లిద్దరూ 'నాన్నా! అమ్మ వచ్చేస్తోంది....' అంటూ కేకలు పెట్టేరు

వాళ్ళ హడావుడికి హడిలి పోయినట్టు నటిస్తూ మళ్ళీ మంచంమీద కూర్చుంది పావని.

అమ్మ తమ ప్రతాపానికి భయపడి పోవడం చూసి కిలకిలలాడారు పిల్లలు.

"ఇక రావచ్చును లెండ ర్రా.... వంట అయిపోయింది. కంచాలు పెట్టేస్తున్నాను" అంటూ కేక పెట్టాడు వంటింట్లో వీర విహారం చేస్తున్న రవి.

బంగాళాదుంపల వేపుడూ, ముద్దపప్పు చూడగానే కంచాలమీదకి ఎగబడ్డారు పిల్లలు.

"అబ్బ! కూర చాలా బావుందినాన్నా! మమ్మీ చేస్తే ఇలా వుండదేం?" అంటూ లొట్టలు వేశాడు బాబిగాడు

**ఆశయం**


నీతి, న్యాయం
అనేవి
నా తోబుట్టువుల్లాంటివి
ఎట్టి పరిస్థితుల్లోనూ
గడప దాటనివ్వను.

—'కృష్ణంరాజు'

అన్నం పప్పు కలుపుకుని ఒక ముద్ద తిన్న చిట్టి "అవును మమ్మీ.. పప్పు కూడా నాన్నే బాగా చేశాడు" అంటూ వంత పాడింది.

వాళ్ళిద్దరి వైపు కొరకొరలాడుతూ చూసింది పావని "విశ్వాస ఘాతుకుల్లారా! నేను మొన్న చేసిన కరివేపాకు పచ్చడీ, నిన్న వండిన వంకాయ ఇగురూ లొట్టలు వేసుకుంటూ తిని 'మా మమ్మీ ఎంత

కే. మీరాబాయి



మంచిదో మా కిష్టమైన వన్నీ చేసి పెడుతుంది' అంటూ ముద్దులు పెట్టారు నాకు. ఇప్పుడేమో నాన్నే బాగా చేస్తాడంటూనా? మీకు చదువు లెందుకుగానీ యించక్క రాజకీయాల్లోకి దిగిపొండి...." అంటూ కసిరింది.

"విశ్వాస ఘాతకుల్లారా అంటే ఏమిటి మమ్మీ?" చిట్టి శ్రద్ధగా అడిగింది.

"అంటే మమ్మీకన్నా బాగా వంట చేసే నాన్నలాంటి వాళ్ళమ్మా" ఓరగా పెళ్ళాం కేసి చూస్తూ అన్నాడు రవి

"చాల్లెండి గొప్పు!" అంటూ మరి కాస్త కూర వేసుకుంది పావని.

* * *

మరుసటిరోజు ప్రొద్దున వంట మొదలు పెడుతున్న పావని దగ్గరకు హుషారుగా వచ్చాడు రవి. "ఈ పూటా వంట నేనే చేస్తానుగానీ.... 'ఆ బోడి బజారు' పని నువ్వు చూసుకుందూ! 'ఆడవాళ్ళను వంటింట్లోనె అణిచివేస్తున్నారీ మగవాళ్ళు' అంటూ బాధపడ్డావుగా నిన్న.." అన్నాడు చాలా నిజాయితీగా!

"ఏం? చేతకాదనుకుంటున్నారా? ఇంకా మీరే రెండ్రోజులు వంట చేసే సరికి నా వీల్లకాదు బాబోయ్ అంటూ గోలపెడతారు. సర్లే నేను బజారుకు వెడుతున్నా...." రోషంగా అంది పావని.

అయిదు నిమిషాల్లో తయారై వచ్చి "బాబీ రిక్షా తీసుకురారా!" అంది కొడుకుతో.

"సెంటరుదాకా వెడితే రిక్షాలు దొరుకుతాయిగా...." మెల్లిగా అన్నాడు రవి. పావని ఎర్రగా చూడగానే "ఓహో! ఎండకదూ!" అంటూ లోపలికి జారుకున్నాడు.

పావని రిక్షా ఎక్కుతుంటే "అమ్మా మేమూ వస్తాం" అంటూ వెంటబడ్డారు బాబీ. చిట్టీ

"నోరుమూసుకుని కూర్చుని చదువుకోండి. నాన్న వెళితే ఇలాగే వెంట బడతారా?" అంటూ కోప్పడింది పావని.

అప్పుడు ఉదయం పది గంటలు

* * *

ఒంటిగంట అవుతుండగా గేటు ముందు రిక్షా ఆగిన చప్పుడు విని బయటకు వచ్చారు రవీ. బాబీ చిట్టీ.

కణతలు నొక్కుకుంటూ రిక్షా దిగి లోపలికి వస్తున్న పావని "వాడికి ఎనిమిది రూపాయలిచ్చి పంపించండి. రానూపోనూ మాట్లాడాను" అంటూ రవికి హుకుం జారీ చేసి యింట్లోకి వెళ్ళింది.

ఆశ్చర్యంతో తెరచిన నోరు అర నిముషం తరువాత మూసుకుని. సరుకులు లోపలికి చేర్చి. రిక్షావాడికి డబ్బులిచ్చి పంపి లోపలికి వచ్చాడు రవి.

హాల్లో మూలగా నిలబడిన సైకిలు తనకేసి చూసి జాలిగా నవ్వినట్టనిపించింది రవికి

గదిలో పావని కూతురు అందించిన మంచినీళ్ళు తాగి. రుమాలొకటి నీళ్ళలో తడిపి నుదుటిమీద వేసుకుని, పడుకుని వుంది.

ఫాను ఫుల్‌స్పీడులో పెట్టివచ్చి పావని పక్కన కూర్చుంటూ "కాస్త అన్నం తినేసి పడుకుంటే తలనొప్పి తగ్గుతుంది పావనీ...." అనునయంగా అన్నాడు రవి.

"కాసేపు నన్ను మాట్లాడించకండి" అంటూ కసిరింది పావని

* * *

ఆ రాత్రి భోజనాలప్పుడు గోంగూర పచ్చడి లోకి నూనె వేసుకుని, నలుగురూ ముఖాలు చిట్లించారు.

"నూనె కిరసనాయిలు వాసన వేస్తోందమ్మా!" బాబీ అన్నాడు

"ఏ కొట్లో తెచ్చావ్? రవి అడిగాడు

"కొట్టు యెవడిదో. వాడి పేరేమిటో అడిగి జాతకం అదీ అడిగి పట్టుకు రావడం మరిచిపోయాన్లెండి" కోపంగా అంది పావని.

"అవి కాదోయ్! నాలుగు కొట్లలో అడిగి కొత్త మంచి సరుకులు చూసి తెచ్చుకోవద్దూ?" నవ్వుతూ పుడికించాడు రవి

"ఆఁ తిరుగుతారు. అసూర్యంపశ్యగా వుండాల్సిన సుకుమారిని ఎండలో తిరిగి రమ్మనే ఈయనేం మొగుడమ్మా! ఎలాగో ఆ రిక్షావాడిని పట్టుకుని ఆ షాపేదో కనుక్కుని వెళ్ళి నూనె వాడి ముఖాన కొట్టిరండి!" ఆజ్ఞాపించి. పచ్చడి అన్నం పక్కకు తోసేసి. మజ్జిగ పోసుకుంది పావని.

మంచినీళ్ళు తాగుతున్న రవికి పర్వాగక పొలమారింది.

మూతీ ముక్కూ తిప్పి లేచి పెరట్లోకి నడిచింది పావని

ఆ రోజుకు ఉగాది నాలుగు రోజులుంది.

* * *

మరునాడు సాయంత్రం.

"పండుగ బట్టలకు మూడు వందలంటే ఈ నెల డెఫిసిట్ బడ్జెట్ అవుతుందోయ్ " సందిగ్ధంగా అన్నాడు రవి

కోపంగా అతనివైపు చూసి "సంపాదించింది తెచ్చి మీ చేతిలో పోయడం తప్ప యెంత ఖర్చవుతూంది. దేనికి అవుతోంది అని వొక్కనాడైనా అడిగానా? ఎప్పుడో ఒకసారి పొరపాటున పండుగకు క్రొత్త బట్టలంటూ ముచ్చటపడ్డాను తప్పే! ఇదీ మా ఆడవాళ్ళ ఆర్థిక స్వాతంత్ర్యం" నిష్ఠూరంగా అనేసి ముఖం తిప్పుకుంది పావని.

ఘుమఘుమలాడే సబ్బుతో స్నానం చేసి చాకింటినుంచి వచ్చిన జరీ అంచు తెల్ల చీర కట్టుకుని. తలలో మల్లెలు ముడిచిన పెళ్ళాం మూతి ముడుచుకోవడం చూసిన రవి గుండె విలవిలలాడింది

అరెరె.... అంతలో అంత కోపం దేనికోయ్! నీ వన్నట్టే చేదాం.. అర్థేచ. ధర్మేచ. కామేచ నువ్వుగాక ఇంకెవరోయ్ భామామణీ! "అర్థం" పట్టుకుని బజారుకు వెడదాం.. పెళ్ళాం పిల్లల్ని చూసుకోవడం మగవాడి ధర్మం.. పిల్లలకు నీళ్లు పోసేశాను.. నీకూ పోద్దామంటే నీవు అప్పుడే స్నానం చేసేశావు.... ఇక మూడోదీ, కామేచ...." అంటూ రవి కొంటెగా పెళ్ళాం కొంగు పట్టుకుని లాగాడు.

"చాల్లెండి.... కొంటెచేష్టలు చేస్తే మూతిపళ్ళు రాలేను...." పక పక నవ్వింది పావని.

"మూతిపళ్ళు రాలగొట్టడానికి సమయాసమయాలు లేవు గనుక...."అంటూ భార్య ముఖం దగ్గరగా వంగి. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు రవి.

"ఛీ ....గరం మసాలా వాసన" ముఖం చిట్లించి. పెదవులు తుడుచుకుని గదిలోకి పరిగెత్తింది పావని.

ఉగాది రోజున!

కొత్త చీరెలో మెరిసిపోతున్న తనను



## ఉత్తమ బహుమతి

వివాహాది శుభకార్యాలకు, బహుమతి ఇచ్చేందుకు రుచికరమైన వంటకాలకు ప్రసిద్ధి చెందిన పుస్తకం

**శ్రీమతి మాలతీచందూర్**

**వంటలు - పిండివంటలు — రు. 20-00**

అన్ని పుస్తకాల షాపులలోనూ దొరుకుతుంది. లేదా ఒక రూపాయి తగ్గించి M.O పంపినవారికి ఆ రూపాయికి V.P.P. పెట్టిపంపుతాము.

**క్వాలిటీ పబ్లిషర్స్,** రామ మందిరం వీధి, విజయవాడ-2



## కాయకల్ప చికిత్స

ఈ చికిత్సవలన 3 లేక 4 మాసములలో జుట్టు రాలిపోవుట ఆగిపోయి, దట్టముగా వెంట్రుకలు పెరుగును. అకాలములో నెరసినవెంట్రుకలు నల్లబడును. చత్వారం తొలగిపోయి కండ్లజోడుతో నిమిత్తములేకుండామంచి చూపు వచ్చును. కదలిపోయిన పండ్లు మరల బిగిసిపోవును. తల్లి గర్భమునుండి జన్మించినప్పుడు దేహమునకు ఏ రంగు వున్నదో మరల ఆ రంగువచ్చి సౌందర్యము అభివృద్ధియగును.

వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రూ. 5-00లు యం.ఓ. పంపవలయును.

మేనేజరు


**శ్రీ యోగాశ్రమ్,**
**పెదవాల్తేరు,**
**విశాఖపట్టణము-17.**



## Orwell School

(English Medium)
(Recognised by Govt of Andhra Pradesh)
Offers
HOSTEL ACCOMMODATION to All Students of all Schools classes: Pre-Kg. to X std. and Matric.
Excellent facilities– Individual attention - Well guarded premises are better this year.
Age group: boys: 3 to 16yrs.
girls: 3 to 10yrs.
for prospectus and other details send Rs. 5/- or contact.

**PRINCIPAL**
10-1-21, Aseelmette Junction
VISAKHAPATNAM - 530003

చూసి మురిసిపోతున్న మొగుడివంక మురిపెంగా చూస్తూ యిలా అంది పావని. "మీకూ కొత్తబట్టలు తీసి వుంటే బాగుండేది...."

పంచాంగం తిరగేస్తున్న రవినవ్వేస్తూ. "మీ పంచాంగకర్త కూడా నాలాగే స్త్రీ పురుష సమానత్వాన్ని వ్యతిరేకించేవాడిలా వున్నాడు 'స్త్రీలు, పిల్లలు నూతన వస్త్రములు ధరించవలెను' అని రాశాడు చూశావా?" అన్నాడు

"జోకు చాల్లెండిగానీ... నా మాట విని మీరుకూడా కొత్తబట్టలు తీసుకునివుంటే ఎంత బాగుండేది!" చీరెవంక ఆప్యాయంగా చూసుకుంటూ. మరోసారి అంది పావని.

"నిజమేనోయ్! అలా తీసుకోక పోవడం నీ "సమానత్వం" సిద్ధాంతానికే దెబ్బ కదూ! పద. పద! ఆ "విమల్" చీరె వాపస్ చేసి, ఆ రెండు వందల్లో వంద రూపాయలలోపు నీకో వాయిలు చీరె. మరో వంద పెట్టి నాకో డ్రెస్ తెచ్చుకుందాం!" కొంటెగా అన్నాడు రవి.

"ఆ మాట ఆ రోజే నేనంటే సరేమిరా అంటూ పడనిచ్చారుకాదు రెండొందలూ పెట్టి ఈ చీరె తీస్తేగానీ వూరుకోక నస పెట్టారు ఇప్పుడు ఏంట నామీదా! అసలు మేం మీతో సమానులం కాముగాక కాం.. ఎవరన్నారండీ ఆడవాళ్ళూ. మగవాళ్ళూ సమానులే అనీ ..." నిలదీసింది పావని.

కుర్చీలోనుండి ఎగిరిపడ్డాడు రవి. "నువ్వేనా మాట్లాడేది! వచ్చే ఆదివారం మీ క్లబ్బులో 'స్త్రీ పురుష సమానత్వం' మీద నువ్వు మాట్లాడాలని గుర్తుందా? నీ ఈ అభిప్రాయం నీ స్నేహితులు వింటే ఇంకేమన్నా వుందా?" కంగారు నటించేడు.

పావని వయ్యారంగా నడుస్తూ రవి కూర్చున్న కుర్చీ దగ్గరకు వచ్చింది. పక్కనేవున్న టేబులుమీద చేత్తో గట్టిగా కొట్టి "ఆడవాళ్ళూ. మగవాళ్ళూ ఎప్పటికీ సమానులు కారు. అసలు ఆ సమానత్వం మాకు వద్దు. పురుషులకన్న తాము అధికులమని గుర్తించలేని, ఆ ఆధిక్యతను సవ్యంగా వుపయోగించుకోలేని అజ్ఞానం నుంచి కళ్ళు తెరవాలి మన ఆడవాళ్ళు! అప్పుడే మనం అభ్యున్నతిని సాధించగలం!" అంటూ ఉపన్యాస ధోరణిలో చెప్పి. రవివైపు ప్రేమగా చూసి అల్లరిగా నవ్వింది పావని.

కొత్త చీరెలో పెళ్ళికూతుర్లా వున్న పెళ్ళాన్ని మాటలతోనా లేక చేతలతోనా అభినందించాల్సిందని ఆలోచిస్తున్నాడు రవి.